ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శనివారం | సెప్టెంబరు 26, 2026 | సంపుటి : 7 | సంచిక : 99 | పేజీలు : 2



గంగమ్మ ఒడికి గణపయ్య

వైభవంగా ఖైరతాబాద్ గణపయ్య శోభాయాత్ర

హైదరాబాద్, ఆయుధం

ఖైరతాబాద్ బడా గణేశుడి నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఉదయం 9 : 30 గంటలకు ఖైరతాబాద్‌లో శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ తెలంగాణ తల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ఈ శోభాయాత్ర కొనసాగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 2:30 గంటలకు హుస్సేన్ సాగర్‌లో భారీ క్రేన్స్ సాయంతో నిమజ్జనం చేశారు. ఖైరతాబాద్ గణనాథుడి చివరి రూపాన్ని చూసేందుకు, నిమజ్జన వేడుకను వీక్షించేందుకు రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు హుస్సేన్ సాగర్, ట్యాంక్ బండ్ పరిసరాలకు తరలివచ్చారు.



వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు

కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

- తెలంగాణ పద్మశాలి యువసేన మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆడేపు నగేష్



హనుమకొండ, ఆయుధం: తెలంగాణ ఉద్యమ యోధుడు స్వాతంత్ర సమయోధుడు బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని వరంగల్ ఎయిర్ పోర్ట్ కు ఆయన పేరు పెట్టాలని తెలంగాణ పద్మశాలి యువసేన మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆడేపు నగేష్ కోరారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కుల ఆత్మగౌరవం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన చేసిన సేవలను కొనియాడు నిజాం వ్యతిరేక పోరాటం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం వరకు ఆయన ప్రజా సమస్యల కోసం పోరాడారు అని తెలిపారు. వరంగల్ కు చారిత్రక, సాంస్కృతికంగా ప్రత్యేకమైన గుర్తింపు అలాంటి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న విమానాశ్రయమానికి తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చిన మహనీయుని పేరు పెట్టడం ద్వారా ఆయన సేవలను భవిష్యత్తు తరాలకు పరిచయం చేసినట్లు అవుతుందని తెలిపారు లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను యువతకు విద్యార్థులకు తెలియజేసే విధంగా ఉండడానికి ఎయిర్ పోర్టుకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు తప్పకుండా పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని ఆయన ఒక ప్రకటనలు తెలిపారు.


2 లో

సీఎం రేవంత్‌కు ఆర్యదాన్ మహ్మద్ అవార్డు

- అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా
- సీఎం రేవంత్ రెడ్డి

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు త్వరగా పూర్తి చేయాలి

- పనులను పరిశీలించిన సీఎంఓ కార్యాలయ ఉన్నతాధికారులు

2 లో

వరంగల్‌కు కేంద్రం నిధులు ఇప్పించండి

- సీఎం రేవంత్‌రెడ్డి ని కలిసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య
- కేయూకు పీఎం-ఉషా నిధుల కోసం కేంద్రాన్ని కోరాలని అభ్యర్థన
- వరంగల్ పురావస్తు మ్యూజియానికి కేంద్రం నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించాలని విజ్ఞప్తి
- నైలిట్ కేంద్రం ఏర్పాటుకు కేంద్రంతో మాట్లాడాలని కోరిన ఎంపీ
- సీఐటీడీ కేంద్రం ఏర్పాటుతో యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ అవకాశాలు
- వరంగల్‌లో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కోసం కేంద్రాన్ని కోరాలని సీఎంకు విజ్ఞప్తి



హైదరాబాద్, ఆయుధం: వరంగల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కలిసి వినతిపత్రాలు అందజేశారు. కాకతీయ యూనివర్సిటీకి పీఎంఉషా నిధుల మంజూరు, వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర నిధులు, వరంగల్‌లో నైలిట్, సీఐటీడీ కేంద్రాల ఏర్పాటు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు అంశాలను ముఖ్యమంత్రికి ఎంపీ వివరించారు.

కేయూకు పీఎం-ఉషా నిధులు:

కాకతీయ యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు పీఎంఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేసి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు. విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు.

పురావస్తు మ్యూజియానికి రూ.10 కోట్లు:

వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించేలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ని ఎంపీ కోరారు. 1991లో ఏర్పాటు చేసిన ప్రస్తుత మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త మ్యూజియం భవన నిర్మాణం 2023 మేలో పూర్తయినప్పటికీ కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన వసతులు, భద్రత, వాతావరణ నియంత్రణ తదితర పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. 2026-31కు సంబంధించిన సవరించిన మ్యూజియం గ్రాంట్ పథకం మార్గదర్శకాలు వెలువడిన అనంతరం ప్రతిపాదన సమర్పించాల్సి ఉన్నందున, ఆ మేరకు కేంద్రంతో సమన్వయం చేయాలని కోరారు.

వరంగల్‌లో నైలిట్ కేంద్రం:

వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో మాత్రమే ఉన్న ఈ సంస్థకు వరంగల్‌లో కేంద్రం ఏర్పాటు చేస్తే వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఐటీ, ఎలక్ట్రానిక్స్, A I, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ తదితర రంగాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ, ధ్రువపత్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

సీఐటీడీ ఏర్పాటుకు విజ్ఞప్తి:

వరంగల్‌లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు, నైపుణ్యం కలిగిన యువత, ఎంఎస్ఎంఈలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. టూల్ అండ్ డై డిజైన్, సీఏడీ/సీఏఎం, సీఏనసీ మిషనింగ్, మౌల్డ్ తయారీ, ప్రెసిషన్ ఇంజినీరింగ్, రోబోటిక్స్, ఆటోమేషన్, 3డీ ప్రింటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందించడంతో పాటు స్థానిక పరిశ్రమలకు సాంకేతిక సహకారం లభిస్తుందని వివరించారు.

పాస్‌పోర్ట్ సేవా కేంద్రం:

వరంగల్‌లో ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. 2017 మార్చి 29న ఏర్పాటు చేసిన POPSK ద్వారా ప్రాంత ప్రజలకు సేవలు అందుతున్నాయని, పాస్‌పోర్ట్ సేవలకు డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. తత్కాల్ పాస్‌పోర్ట్ సేవల కోసం కరీంనగర్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.

వరంగల్ ప్రాంత విద్యార్థులు, యువత, పరిశోధకులు, ప్రజలకు మెరుగైన విద్య, నైపుణ్య, సాంకేతిక, కేంద్ర ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించే చర్యలకు కేంద్ర సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున చొరవ చూపాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎం రేవంత్ రెడ్డి ని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎంపీ డా.కడియం కావ్య ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



పండిత్ దీన్ దయాల్ జయంతి

హైదరాబాద్, ఆయుధం: భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త, ఏకాత్మ మానవతావాద ప్రణేత, మహోన్నత నాయకులు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని నాంపల్లి రాష్ట్ర బిజెపి కార్యాలయంలో నిర్వహించారు. బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, వరంగల్ జిల్లా ఇన్ చార్జ్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చూపిన మార్గం, ఆయన సిద్ధాంతాలు దేశ ప్రగతికి, సమాజంలోని చివరి వ్యక్తికి ఫలాలు అందాలనే అంత్యోదయ సంకల్పానికి పునాదులని కొనియాడారు. దేశ సమగ్రత కోసం, పేదల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని, నేటి తరం కార్యకర్తలు ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసి, పార్టీ బలోపేతానికి, సమాజ సేవకు పునరంకితం కావాలని కోరారు.



తాళ్ల మల్లేశం చిత్రపటానికి

కుడా చైర్ పర్సన్ నివాళి



వరంగల్, ఆయుధం: తాళ్ల పద్మావతి విద్యాసంస్థల అధినేత కీ.శే. తాళ్ల మల్లేశం ఇటీవల మృతి చెందగా.. శుక్రవారం కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(కుడా) చైర్ పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జి.డ బ్ల్యూ.ఎం.సి. మాజీ మేయర్ గుండు సుధారాణి వారి నివాస గృహానికి వెళ్లి వారి చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, వారి కుమారులు తాళ్ల వంశీ, తాళ్ల వరుణ్ కుటుంబ సభ్యులను పరామర్శించినారు. అనంతరం వ్యాపారవేత్త కుసుమ కేదారి (కెకె సిమెంట్ అండ్ ఐరన్ మర్చంట్) తల్లి కీ.శే. కుసుమ జయలక్ష్మి ఇటీవల మృతి చెందగా గుండు సుధారాణి దూపకుంట లోని వారి నివాస గృహానికి వెళ్లి వారి చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, తాజా మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, నగర కాంగ్రెస్ కార్యదర్శి జినుక రమేష్, నాగమయ్య గుడి ధర్మకర్త శంకేసి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సరఫరాకు

ప్రాధాన్యతనివ్వాలి

- పకడ్బందీ ప్రణాళికతో తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి
- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలి
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క

హనుమకొండ, ఆయుధం: తాగునీటి సరఫరాకు అధికారులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, పకడ్బందీ ప్రణాళికతో తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించి పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎల్ నినో సన్నద్ధత, విబిజి రాంజీ, ఆర్డబ్ల్యూఎస్, హ్యామ్ రోడ్స్ పై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న సీతక్కకు పోలీసులు గౌరవ వందనం సమర్పించగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సమీక్షా సమావేశంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఎల్ నినో, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సీతక్క సమీక్షించారు. సాగునీరు, తాగునీరుకు సంబంధించిన అంశాలను సాగునీటి పారుదల శాఖ అధికారులు, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు, అభివృద్ధి పనుల పురోగతి గురించి వివరించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ తాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు, భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు చేపట్టే బోర్ రీచార్జ్ పనులపై ప్రత్యేక (మిగతా 2లో..)



నిమజ్జనోత్సవాల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఆయుధం: గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను ఉత్సవ నిర్వాహకులు వేగవంతంగా పూర్తిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. వర్షం కురిసే అవకాశమున్నందున నిర్వాహకులు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ రోజు రాత్రి వరకు నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయాలనే భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్ డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనర్, కలెక్టర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి విహంగ వీక్షణం చేశారు.

హుస్సేన్ సాగర్ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. డప్పు చప్పుళ్లు, భక్తుల ఆటపాటలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో మొత్తం 114 నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం కోసం 14,840 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే 10వేలకు పైగా విగ్రహాలు పూర్తయ్యాయని సీపీ సజ్జనర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం లోపు అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని భావిస్తున్నట్లు చెప్పారు.

ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి
- పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో యోగ కార్యక్రమం



హనుమకొండ, ఆయుధం: ఆరోగ్య ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, టూరిజం నోడల్ అధికారి ఎన్. రవి అన్నారు. శుక్రవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని యోగ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల అధికారులు, యోగా సాధకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రతిరోజు యోగ సాధన చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని, అదేవిధంగా ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి లేకుండా ఉండేందుకు యోగ దోహదపడుతుందన్నారు. యోగ ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆయుష్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, యోగ సాధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు పరిశీలించిన కమిషనర్

వరంగల్, ఆయుధం: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కమిషనర్ టి. వెంకన్న శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తాగునీటి పైప్‌లైన్ పనులతో పాటు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ అనుసంధాన పనులను తనిఖీ చేసి, పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా 15 ఆర్థిక సంఘం నిధులతో కాకతీయ యూనివర్సిటీ రోడ్డు రోడ్డు వద్ద ఏర్పాటు చేస్తున్న మంచినీటి పైప్లైన్ల పురోగతిని కమిషన్ పరిశీలించారు.
కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రవికుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డీఈ శ్రీకాంత్, ఏఈలు తదితరులు ఉన్నారు.



ఏ.బి.బర్ధన్ జయంతి సందర్భంగా ఘన నివాళి

హనుమకొండ, ఆయుధం: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏ.బి. బర్ధన్ 102 వ వర్ధంతి సందర్భంగా ఖిలా వరంగల్ మండలం మార్కండేయ నగర్ పార్టీ కార్యాలయం ఏబి బర్ధన్ భవన్ లో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా పాల్గొని మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలన కాలంలో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన అనంతరం శాసనసభ్యుడిగా సిద్ధాంతవేత్తగా రచయితగా కార్మిక నాయకుడిగా కార్మిక వర్గ హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఏఐటీయూసీ లకు నాయకత్వం వహిస్తూ ప్రజా సమస్యలపై స్పష్టమైన వైఖరితో పోరాడారు. లౌకిక ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతను బలోపేతం చేయడానికి భారత రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి ఆయన చేసిన కృషి చిర స్మరణీయం. కామ్రేడ్ ఏ.బి. బర్ధన్ జీవితం భారత వామపక్ష ఉద్యమ చరిత్రలో సంప్రదాయంలో శాశ్వతంగా నిలిచిపోతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, ఎండి.అక్బర్ పాషా, సుంకరి భవాని, శాఖ కమిటీ సభ్యులు ధూమాల పద్మ, బాశెట్టి రంజిత్, ఎండి.తస్లీమ్, కార్యకర్తలు ధూమల భాను, హరి, అజీమ్, బానోతు సోగ్యా, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు వనం భాస్కర్ కన్నుమూత



వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని కీర్తి నగర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు వనం భాస్కర్ శుక్రవారం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో స్థానిక జర్నలిస్టు వర్గాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వనం భాస్కర్ మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన పార్థివ దేహాన్ని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల సదానందం నేత సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ భాస్కర్ మరణం జర్నలిజం రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

భాస్కర్ భౌతిక దేహానికి నివాళి



వరంగల్, ఆయుధం: వరంగల్ తూర్పు నియోజకవర్గ రిపోర్టర్ వనం భాస్కర్ ఇటీవల అనారోగ్యానికి గురై మరణించగా వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రిపోర్టర్స్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ వినియోగంతో రైతులకు

మెరుగైన ఆదాయం: గడ్కరీ

జాతీయం, ఆయుధం: ఇథనాల్ వాడకం రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సహాయపడుతుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలని, ప్రజా రవాణాను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లో నూతన బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో గడ్కరీ మాట్లాడారు. రైతులంటే ఈ రోజుల్లో అన్నదాత మాత్రమే కాదని.. 'ఇంధన దాత'లని గడ్కరీ అభివర్ణించారు. ఇథనాల్ ఉత్పత్తి వల్ల రైతులకు మేలు చేకూరిందన్నారు. దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి ప్రారంభమయ్యాక మొక్కజొన్న క్వింటాల్ ధర రూ.1200 నుంచి రూ.2,600కు చేరిందన్నారు. ఫ్లెక్స్ ఫ్యూయల్ కలిగిన ఇంజిన్లు నూరు శాతం ఇథనాల్‌తో నడుస్తాయని చెప్పారు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు.
భారత్ రూ.22 లక్షల కోట్ల పెట్రోలియంను దిగుమతి చేసుకుంటోందని గడ్కరీ ఈ సందర్భంగా తెలిపారు. ఇథనాల్, ఎలక్ట్రిసిటీ, హైడ్రోజన్, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన వాడకాన్ని పెంచి దీన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, హైడ్రోజన్ సాయంతో నడిచే వాహనాలూ అందుబాటులోకి రానున్నాయని గడ్కరీ చెప్పారు. కాలుష్యం పరంగా రవాణా రంగం వాటా గణనీయంగా ఉందని, అందుకే ప్రజా రవాణాను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలతో...

వృద్ధులకు ఆరోగ్యం, మనో ధైర్యం

- డాక్టర్ అనితా రెడ్డి



హనుమకొండ, ఆయుధం: వృద్ధుల వారోత్సవాలను పురస్కరించుకుని స్త్రీ శిశు సంక్షేమం, వృద్ధుల మరియు దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు కే.యు పక్కన గల లార్డ్ వృద్ధ ఆశ్రమములో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కడిపికొండ డాక్టర్లు విచ్చేసి ఉచిత వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితముగా మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలు వృద్ధులకు ఆరోగ్యాన్నే కాక చాలా మనోధైర్యము అందిస్తాయని.. ఎవరు లేని ఆశ్రమములోని వృద్ధులకు తమ ఆరోగ్యం గురించి పట్టించుకునే వారు ఉన్నారన్న ఆనందం సంతృప్తి వారి కళ్ళలో కనిపించిందని అన్నారు. ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల బాధ్యతతో ప్రేమ గౌరవం చూపించాలని, ఏ ఇబ్బంది కలిగినా ట్రిబ్యునల్ కోర్టును సంప్రదించవచ్చని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. వృద్ధాప్యము ఎవరికి శాపంగా మారకూడదని అన్నారు. వృద్ధులకు అన్ని రకాలుగా అందరూ అండగా నిలబడటమే నిజమైన వృద్ధుల వారోత్సవాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, లార్డ్ వృద్ధ ఆశ్రమ నిర్వహకులు నాగరాని నరేష్, డాక్టర్లు బానోతు సంతోష్, కంటి డాక్టర్ ప్రతాపగిరి ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, సంజీవ రావు, సమ్మి రెడ్డి, ఏ న్ ఎం సబితా రాణి, సరోజ, ఆశ వర్కర్ మరియ, మమత తదితరులు పాల్గొన్నారు.

బీసీల కుల జనగణనకు కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం



వరంగల్, ఆయుధం: దేశంలో జరుగుతున్న జనాభా లెక్కల తో పాటు బీసీ కులజనగణన చేయడానికి 80 ఏళ్లుగా అగ్రకుల పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ససేమిరా అంటున్నాయని ఈ జనాభా లెక్కలతో పాటే బీసీల లెక్కలు తీసేంత వరకు వాటా సాధించే వరకు బీసీలంతా ఏకంగా ఉద్యమించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్ రాములు అన్నారు. అక్టోబర్ 16న వరంగల్ జిల్లా బిసి హక్కుల సాధన సమితి రెండవ మహాసభ విజయవంతం కోసం భూపేష్ నగర్ లోని బీసీ కమ్యూనిటీ హాలులో చీకటి ప్రకాష్ అధ్యక్ష తన జరిగిన ఆహ్వాన సంఘ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ రాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల ఓట్ల కోసం మాత్రమే పోటి పడుతున్నాయని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వము బీసీల అభివృద్ధికి వారి జనాభా నిష్పత్తి ప్రకారం విద్య ఉద్యోగ రంగాల్లో స్థానిక సంస్థలలో అసెంబ్లీ పార్లమెంటు స్థానాలలో బడ్జెట్లో వాటా ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శులు షేక్ బాష్మియా, పనస ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమైన బీసీల హక్కుల కోసం బీసీ హక్కుల సాధన సమితి నిరంతరం చేస్తున్న కృషిని అభినందిస్తున్నామన్నారు. జిల్లా మహాసభ విజయవంతానికి తమ వంతుగా పదివేల రూపాయలను విరాళంగా అందిస్తామని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి జాయింట్ సెక్రెటరీ బొట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అక్టోబర్ 16న జరగనున్న జిల్లా మహాసభను జయప్రదం చేయడానికి రాజకీయాలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలను బీసీ సంఘాలను ఆహ్వానించామన్నారు. వర్ధన్నపేట మండలం కోఆర్డినేటర్ పోశాల మధుకర్ వ్యక్తిగతంగా మహాసభ విజయవంతానికి రూ.10,116 లు విరాళం ప్రకటించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా రావుల అనిల్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా చింతకింది కుమారస్వామి, కోశాధికారిగా పాము మనోహర్ తో పాటు 50 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. సంగెం మండలం నుంచి బక్క రాజు మాట్లాడుతూ.. తన వ్యక్తిగతంగా పదివేల రూపాయలని విరాళంగా ప్రకటించారు. ఈ సమావేశంలో వరంగల్, ఖిలా వరంగల్, నర్సంపేట మండలాల కార్యదర్శులు చిలుకల రాజు, సల్లూరి నరేందర్, పుల్లూరి కుమారస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబమూర్తి, శైలజా, రాంబాయి, ఆరెల్లి ప్రభాకర్, ప్రభాకర్ రెడ్డి, గోదారి రాములు, మేరుగు రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యతనివ్వాలి

(మొదటి పేజీ తరువాయి..)



దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని, నీటి నిల్వలు, రిజర్వాయర్లు, బోర్లు, మోటార్లు తదితర వాటి పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి వరకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకుని తాగునీరు సరఫరా చేయాలని సూచించారు.
ప్రతీ ఇంటింటికీ ఇంకుడు గుంత, ప్రతీ పంటకు పంట కుంటలను,ప్రతీ ఊరు కి ఊట కుంటలను నిర్మించాలన్నారు. గ్రామాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నీటి రీచార్జ్ వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వీటి ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ సంస్థలు, ప్రజలకు అవసరమైన తాగునీటి వసతులను కూడా ప్రత్యేకంగా పరిశీలించాలని అన్నారు.
ప్రజలకు సరఫరా చేసే నీరు స్వచ్ఛమైన దిగా.. సురక్షితమైనదిగా ఉండేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో తాగునీటి వనరుల పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్న, పెద్ద మోటార్ల మరమ్మతులు, పైపులైన్ల సమస్యలు తదితర సమస్యలను వెంటనే గుర్తించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ఏడాది వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ప్రజలకు నిరంతరాయంగా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సాగునీరు, తాగునీటి సరఫరాకు సంబంధించి గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. ప్రతిపాదిత పనులను వేగవంతంగా పూర్తి చేయడంపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరా లో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టెందుకే ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు.
రోడ్లు, వంతెన, చెక్ డ్యామ్, తదితర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల పరిధిలో చేపట్టిన హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఆవాసం నుండి గ్రామానికి, గ్రామం నుండి మండల కేంద్రానికి రహదారి సదుపాయం ఉండాలనేదే హ్యామ్ రోడ్స్ లక్ష్యమని పేర్కొన్నారు. ఉపాధి కల్పించడం ద్వారా కూలీలకు ఉపయోగపడాలన్నారు. ఉపాధి కల్పించడం ద్వారా గ్రామం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాభివృద్ధికి ఇదొక వరంలాంటిదన్నారు.
స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ మాట్లాడుతూ.. వీబీజీ రాంజీ పథకం ద్వారా కూలీలకు పని దినాలు కల్పించాలని అన్నారు. పథకం ద్వారా చేపట్టిన పనుల పురోగతి పై ప్రతి పదిహేను రోజులకోసారి అధికారులు సమీక్ష చేయాలన్నారు. పనులను పూర్తి చేయడంలో, కూలీలకు ఉపాధి కల్పించే విషయంలో స్థానిక సర్పంచులను భాగస్వామ్యం చేయాలన్నారు.
సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు. ఎల్ నినో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టాలి అనే అంశాలపై అధికారులు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎల్ నినో ప్రభావం ప్రధానంగా వాతావరణం వ్యవసాయం వర్షపాతం నీటి లభ్యత వంటి కీలక రంగాలపై పడే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ లు చాహత్ బాజ్‌పాయి,అడిషనల్ కలెక్టర్లు, మిషన్ భగీరథ ENC కృపాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ENC జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు

సీఎం రేవంత్‌కు ఆర్యదాన్ మహమ్మద్ అవార్డు



హైదరాబాద్, ఆయుధం: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ 2026' అవార్డును స్వీకరించారు. కేరళం రాష్ట్రంలోని నిలంబూర్‌లో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆర్యదాన్ ముహమ్మద్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు కేరళ వెలుపల నుంచి ఎంపికైన తొలి వ్యక్తిని కావడం మరింత గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. "నేను కేరళం వచ్చిన ప్రతిసారీ ఎంతో ఆత్మీయ స్వాగతం లభించింది. రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో సాగిన భారత్ జోడో యాత్ర కోసం ఇక్కడికి వచ్చాను. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఇక్కడికి వచ్చాను. కేరళం నాకు ఎంతో ఆత్మీయమైనది. కేరళం ప్రజలు లౌకికవాదానికి కట్టుబడి ఉన్నందుకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. "ఆర్యదాన్ ముహమ్మద్ ఒక గొప్ప రాజకీయ నాయకుడు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు. పలుపురు ముఖ్యమంత్రుల వద్ద నాలుగుసార్లు మంత్రిగా పనిచేశారు. కేరళం రాజకీయాల్లో ఆయన ఒక చాణక్యుడిలా ఉండేవారు" అని అన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ నిలంబూర్‌లోనూ, కేరళంలోనూ కాంగ్రెస్ పార్టీకి ఒక మహావృక్షంలా ఉండేవారని గుర్తుచేశారు. ఆయన తన జీవితమంతా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడారని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆర్యదాన్ స్ఫూర్తితో మనమంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ చైర్మన్ ఆర్యదాన్ షౌకత్, కేరళం మంత్రులు, పలుపురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెరిగిన గోదావరి నీటి ప్రవాహం

ములుగు, ఆయుధం: తుఫాను కారణముగా గోదావరి నది పరివాహక ప్రాంతం, ఇంద్రావతి నది పరివాహకం లో పడ్డ భారీ వర్షాలు నేపథ్యంలో సమ్మక్క సాగర్ బ్యారేజ్ వద్ద గోదావరి నదీ వరద నీటి ప్రవాహం పెరిగింది. శుక్రవారం ఉదయం గం 6.00 ని లకు 95400 క్యూసెక్కుల నుండి సాయంత్రం గం 6.00 ని లకు 179500 క్యూసెక్కులకు పెరిగినట్లు అధికారులు తెలిపారు. తదుపరి నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నది లో చేపలు పట్టే వారు గాని, పరివాహక ప్రాంతంలోని ప్రజలు నదిలోకి వెళ్లడం గాని, పశువులును దాటించడం గాని చెయ్యవద్దు అని కోరారు. విషయాన్ని గోదావరి నది పరివాహకప్రాంత ప్రజలకు తెలియచేయవలసినది సంబంధిత మండల అధికారులకు సూచించారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు త్వరగా పూర్తి చేయాలి

- పనులను పరిశీలించిన సీఎంఓ కార్యాలయ ఉన్నతాధికారులు

వరంగల్, ఆయుధం: వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్ రాజ్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంఓ కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, వివిధ విభాగాల నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనుల నాణ్యతను, చేపట్టాల్సిన పనులను ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గార్లు ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695